# ౫ పాపిష్ఠి పదిరూపాయలనోటు

1937 డిశంబరు 25 మొదలు 1937 డిశంబరు 31 వఱకూ గల వారంరోజులూనూ అవి. ఆరోజుల్లో నాజ్యానికి మంచి చలామణీ అను కోండే ఇట్టే వచ్చేసింది. దేన్నిబట్టి? బంగారం చవకై, వెండిచవకై, దేశంలోపంట ఎక్కువై కాదు. ఎమ్. ఎస్. ఎమ్. కంపెనీవారు, ఎస్. ఐ. కంపెనీవారు ఏకమై నాతి ప్రియంగా సీజన్‌టిక్కట్లు ఇష్యూ చేయడం వల్లను పదిరూపాయలనోట్లూ ఇరవైరూపాయలనోట్లూ బుక్కింగు ఆఫీసుల్లో గాలిపడగల్లా ఎగిరిపోతున్నాయి. కూలివాళ్ళ చేతుల్లోను, బిళ్ళవాళ్ళ జేబుల్లోను, డబ్బులకుమాఱు రూపాయిలు గచ్చకాయల్లా గలగల్లాడుతున్నాయి. మఱి ప్రయాణీకులు ఏవూరి కావూళ్ళోనే బడ్జెటులు ప్రిపేరుచేసుకుంటూ ఏవూరి బడ్జెట్టు కాగితాలు ఆవూళ్ళోనే చించి పారేయడంవల్ల నాగరకసంబంధమైన సైడుకాల్వలన్నీ కాగితమ్ముక్కల్తో పూడిపోయినాయి. ప్రతీవారి మనస్సూకూడా ఆసేతుహిమాచల పర్యంతం పద్మవ్యూహం పన్నినట్లు పన్నేస్తూవుంది — రాత్రి చూచింది పగలు చూడకుండా, పగలుచూచింది రాత్రిచూడకుండా ఏలాగు చతుర్దశభువనాలు పదిహేనురోజుల్లో పది పన్రెండు రూపాయల్తో చుట్టబెట్టుకు రావడం అనే గొప్ప పన్నాగం బద్మవ్యూహం పన్నినట్లు పన్నేస్తూవుంది.

నాకున్నూ రైల్వేగైడు 24-12-1937 రాత్రిభాగమందు తిరగేస్తూ వుంటే. ఆ విప్రోత్తము వజ్రపంజరనిభంబై పోయినట్లు— కరిగిపోయింది.

రాత్రి నడిచేరైళ్ళచప్పుడుకూడా, అవి ఎంతదూరాన్నుంచి పోతూవున్నా మనకోసమే నన్నట్లు చెవుల్లో దూరుతూవుంటుంది జోరీగ రుతంలాగు, అందులోను డూప్లికేటు మెయిళ్ళన్నవి అసలే నిద్రపట్టనివ్వవు.

సరిగ్గా రాత్రి 12 గంటల వేళకు లేచి నాకోటు జేబులోనుంచి నిజంగా ఓ పదిరూపాయలనోటు తీసిచూచి "దీన్ని జోన్ టిక్కట్టుకోసం ఖర్చుపెట్టడమా వెధవ విశాషాలు ఆమాత్రం ఈవూళ్లోవుంటే చూళ్ళేమా" అని పర్యాలోచించాను — To save or not to save ten Rupees? Not to save అంటే గంగపాల్జేయడమే అనుకోండి.

ఆనోటు అలా గుండెలమీద పెట్టుకు గుండెలమీద నోటుమీద కూడా చేయిఆనిచి వెల్లకితలా పండుకున్నాను. కళ్ళుమూసుకున్నాను.

కల ! కల అనేకంటె కలలుఅంటే మెఱుగేమో — కలలు అన్నాకంటె కలల అలలు అంటే మఱీ నిజానికి దగ్గఱగా వుంటుందేమో — స్వప్నార్ణవమే అది ! స్వప్నసువర్ణార్ణవమే అది !

మెయిల్‌గాడీ కలకత్తానుంచి మదరాసు పోతూవుంది. నిడదవోల్లో డైనింగుకార్లో, దొరల డైనింగుకార్లో హేటూబూటూ వేసుకొని — పొరబాటు — హేటుతీసి వేసికొని బూటులేసు సరిచూచుకొని, ఎక్కి కూర్చుని వున్నానట. నాప్రక్కనే ఓయువతి ! దొరసానికాదు. స్వదేశీ స్త్రీయే, బంగాళీ నాజూకు మనిషి. తన గులాబిరంగు మేలిముసుగులోంచి నా బంగాళీక్రాప్ మెచ్చుకొంటూవుందా అన్నట్టు నా కెదురుగా కూర్చుని నవ్వుతూ నిగనిగలాడే తన ఉంగరపు వ్రేలితో ఫోర్కు ఎత్తుతూవుందిట. అందం అనే రసాన్ని మేమిద్దఱంకూడా ఒకళ్ళొకళ్ళ అరోగ్యం కోసంగాను కనుల్నిండా నింపుకొని, లోచూపుగుండా తాగేశాం అనుకోండి, ఆ డిన్నర్‌లో చవిచూడ వలసిన చివరపదార్థంగా !

ఆఅల వొడ్డుచేరి విఱిగిపోయేలో మఱోఅల దూరాన్ని లేచివుంది. రేణిగుంటదగ్గర అపరాహ్ణం 2 గంటలకు బొంబాయి ఎక్స్ప్రెస్సు రెండో తరగతి కంపార్టుమెంటులో కూర్చుని వున్నానుట. ఎదురబెర్తుమీద కన్నడ కామినులు ఇద్దఱూ వాళ్ళతండ్రీ వొక్కడూ ముగ్గురూ కూర్చొని వున్నారు. తండ్రి ఏమన్నా జరీతలపాగా పెట్టుకు అతిరస్యాగా పంతులు పఠాణీవేషంగా తోచేడు. ఎఱ్ఱగా వున్నాడు గాని మీసాలు తెల్లగా నెరిసిపోయినాయి. తెల్లకోటు వేసుకొని ఉన్నిమఫ్లరు మెడకు చుట్టుకొన్నాడు. ఆడపిల్లలు ఇద్దఱూ ఒకర్తు బి. ఎ., ఒకర్తు ఎం. ఏ., ప్యాసయినట్టుగా ఓమూలకు కూర్చుని క్రాసువర్డుపజిల్సు సాల్వు చేస్తూవున్నారు. ఎక్స్ప్రెస్సు అతి వడిగా కొండల మార్గాన్ని పడిపోతూవుంది. మదరాసు అనతిదూరాన్ని వున్నా తానెక్కడికో పోతూవున్నట్టు. ప్రకృతి సౌందర్యం ఇరువెంపులా బహూసుందరంగా వుంది—ప్రకృతియొక్క ప్రతిబింబం యువతుల చెక్కిళ్ళమీద ముద్దులు పోహణిస్తూవుంది. లావణ్యంవుంది వాళ్ళల్లో, లావణ్యానికితోడు అనన్యమైన విద్యావ్యాసంగంవుంది. పజిల్ సాల్వ్‌చేస్తుచేస్తూ మెదడుమండి ఆలాపారేసినట్టు ఇద్దఱూకలిసి ఆ మేగజీను నాబెర్తుమీదకు గిరాటేశారు. నేను వో నిమేషం ఆగి న్యూస్‌కోసమా అన్నట్టు పైకితీసి చూచి నామోకాళ్ళమీద మోపి, జేబులోంచి వో తెల్లకాగితం తీసి, నోట్ చేస్తూవున్నాను. వాళ్ళు ఆయువతులు తమ మెడలుసాచి, తలలువంచి నానోటింగు ఏమిటాఅన్నట్టు చూడ్డం మొదలుపెట్టేరు. నేనూఅప్రయత్నంగా నాతలఎత్తేనేమో ! ఏంజరిగింది ? ఢీఢిక్కు ! బ్రైన్ వూపువల్ల ! ఓహో !

ముసలితండ్రి ఆవల రైలుకేమైనా మోసం కలిగిం దేమోనని కిటికీగుండా తొంగిచూస్తు వున్నాడు. మేమైనా వొకళ్ళకొకళ్ళం, No danger, No matter please excuse puzzles solve చేశాం.

చూడో అలి! అది మటీబలే అలి. అది అధునాతన సనాతన కన్నెవన్నె రెండూకలిసి పీతెంచిందా అన్నట్టు నన్ను ఆశ్చర్యనిమగ్నుణ్ణి గావింపచేసింది. ఏలాగంటారేమో? రైలుదిగానుట! ఓపట్నం! అది చిన్నపట్నమా అంటే చిన్నపట్నం గాదు. బొంబాయిఅంటే అలాగూ తోచ లేదు. కలకత్తావా అంటే కలకత్తాతోనూ పోల్కికలదికాదు. భూమ్మీదవున్న చిప్పన్నరాజుల పట్నాల తీరుల్లోనూ వోదానితీరూ దానియందు కనబడలేదు. దానికల్లా ఈడైనపురి "హరివంశం" లో చదివిన మణిపురిమైనా కావాలి లేదా ద్వారకాపురమైనా కావాలి. ఎంచేతాఅంటే ఎనిమిది యోజనముల వెడల్పూ పంౘ్రెండు యోజనముల నిడుపూను దానిది. లోపలమళ్ళీ సౌధ వలయాలు! ఉజ్వలచపలాలతా రమ్యశారదాభ్రమండలాలు! అలాంటి ప్రాచీనపుపట్నం ఏ గరుత్మంతుని మూపుమీదనుంచో దిగి కనుగొన్నానూ అంటే అర్థంవుంటుందిగాని రైలు దిగి 20వ శతాబ్దంలో కనుగొన్నాను అంటే నమ్మశక్యం అవుతుందా? కాదు: కాకపోయినా నమ్మకతప్పదు. అటువంటి ప్రభావంవుందికలకు.

ఆపట్నంలో అమాంతంగా గంటకు అణాఅద్దెఇస్తానని ఓసైకిలు నేను అంగడిలోమాటాడి పుచ్చుకు పట్నపు వైభోగం నాలుగుదెసలా పరీక్షిద్దామని బయలుదేరానట. బయలుదేరీ బయలుదేరడంలోనే, సైకిలు మీదకు కాలింకా ఎగరేశానో లేదో, 18ఏళ్ళ ఆంధ్రబాలిక నాకుమేనత్త కూతురల్లే ఎదురై, "బావా" అన్నట్టయింది. అలా చూచేను.

పిల్లకు లోలాకులు చెవుల్ని చిన్న సిబ్బిరేకులంతవి ఊగిసలాడు తున్నాయి. జడచివర సిల్కురిబ్బను ముందుకేసుకు ఇంకా మెలేసు కుంటూనేవుంది నడిబజార్లో. నేనెలాచూచానో ఆలాగే నాకేసి ఆపిల్లా కనుగిలిపింది. "ఇక్కడున్నావేం" అన్నాను. "ఏమీలేదు వదిరూపా

యాల టిక్కెట్టుచ్చుకు ప్రయాణం చేస్తూవున్నాను" అంది. అయితే మనిద్దరం కలిసే చూద్దామని టీగ్గా సైకిలు ఎక్కకుండా నడిపించుకుంటూ, ఆపిల్లా నలాకాదు ఇలా ఈపక్కని నడవమని నాకు చేరిగ్గా చీరాతనిస్తూ, నాకు తోచినంతలో అప్పుడప్పు డామె ముఖం గమనిస్తూ, అక్కడక్కడ కొంతకొంత చూపు నేలకు వదిలేశాను. కాని మాటాడలేదు. ఆమెకూడా నడక పొడుగూతా ముగ్ధగానే వుండిపోయి, పోగాపోగా, చివర్ని మాత్రం ఓముక్క అంది "what a beautiful sunset in this ancient town" అని. "Darkness too!" అన్నాను నేను. విడుద యూర్పు విడిచింది ఆమె.

ఆయూర్పుతో ఆపెద్ద అల అంత ఎత్తులేచి ప్రళయోత్తుంగమనిపించి, ఈత్తుక్కాడకు భగ్నిల్లింది. దాంతో పెద్దపెద్ద అలలు మళీ పొడగట్టలేదు. చిన్న చిన్న అలలుమాత్రం కొట్టుమిట్టాడాయి కాస్సేపు.

చిన్నచిన్న అలలు కొట్టుమిట్టాడాయి అంటే వాలో బాహ్య చిహ్నాలు కనిపెట్టినారో లేదో పాఠకులు ః

కాళ్ళమీదకు బాగా కప్పుకొనివున్న శాలువాను వోపక్కకు తోసేశాను. పెల్లకితలావాణ్ణి పక్కకు తిరిగాను. పక్కకు తిరిగినవాణ్ణి ముడుచుకుపోయాను. ముణుచుకుపోయినవాణ్ణి బోర్లపడ్డాను. బోర్లాపడ్డావాణ్ణి మళ్లీ కాళ్ళు సాచుకు పడుకొన్నాను.

ఈలాగ్గా ఎన్ని విధాలుగానో పోకిళ్ళు పోయిపోయి, తుదకు అమ్మయ్య ! అని ఒళ్ళు విఱుచుకుంటూలేచి, కళ్ళువిప్పి చూచుకొన్నాను. పదిరూపాయిలనోటు నలిగి చినిగి ఎందుకూ పనికిరానిదై, మంచంకింద మూతతీసి నగానికి నీళ్ళువున్న చెంబులో పడి తేలివుంది. ఆ పాపిష్ఠి పదిరూపాయలనోటు.

అక్కటా! ఎంత కష్టం వాటిల్లింది అనుకున్నాను. గతించినదానికి వగచి ప్రయోజనంలేదని తలపోశాను, మఱి జోన్‌టిక్కెట్టు ప్రయాణం మాట ఆలోచించకుండా వారంరోజుల సెలవులూ ఉన్న వూళ్ళోనే గడపి వేశాను. అతి వొంటరినై, మతిసెడి, ధృతిదక్కి—

—: (${}_0{}^0{}_0$) :—

| | | |
|---|---|---|
| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
| 13—1—1938 | రాజమండ్రి | "వినోదిని"లో |